సాక్షి కామారెడ్డి

బుధవారం । 12 । జూన్ । 2024



ఊడ్చేదెవరు.. కడిగేదెవరు

ప్రభుత్వ స్కూళ్లలో గదులు ఊడ్చడం, మూత్ర శాలలు, మరుగుదొడ్లు శుభ్రం చేయడానికి స్కావెంజర్లు గానీ, స్వీపర్లు గానీ లేరు.

- 10లో ▸



ఫిర్యాదులను పరిష్కరించాలి

ఫిర్యాదుల పెట్టెలలో నమోదైన ఫిర్యాదులపై అధికారులు స్పందించి, పరిష్కరించాలని బీజేపీ నేతలు కోరారు.

- 11లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 39.5 /23.5

ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

'ఆన్‌లైన్ ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపులో వృద్ధి'

కామారెడ్డి అర్బన్: టీజీఎస్పీడీసీఎల్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు బిల్లులను అన్‌లైన్ ద్వారా చెల్లించడంలో ప్రతి నెలా 20 శాతం వృద్ధి కనిపిస్తోందని ట్రాన్స్‌కో ఎస్ఈ రమేష్‌బాబు తెలిపారు. జిల్లాలో వివిధ ఆన్‌లైన్ మాధ్యమాల ద్వారా మే నెలలో 49,185 మంది రూ. 6.22 లక్షల విద్యుత్ బిల్లులు చెల్లించారని పేర్కొన్నారు. భవిష్యత్తులో వంద శాతం డిజిటల్ పేమెంట్స్ చేసేవిధంగా వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

బధిర విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి

కామారెడ్డి అర్బన్: బధిరుల ఉచిత ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాలకోసం దరఖాస్తులు కోరుతున్నట్టు జిల్లా సంక్షేమాధికారి బావయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని బధిర బాలబాలికలు ఒకటి నుంచి ఆరో తరగతి వరకు తెలుగు, ఇంగ్లిష్ మీడియంలలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తిగలవారు కరీంనగర్‌లోని శాతవాహన విశ్వవిద్యాలయం ఎదురుగా విజయపురి కాలనీలో ఉన్న బధిరుల ఆశ్రమ పాఠశాలలకు నేరుగా వెళ్లాలని తెలిపారు. ఇతర వివరాల కోసం 90000 13639, 90002 21301, 96668 68755 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

'వృత్తి విద్య కోర్సులలో శిక్షణ అందిస్తాం'

కామారెడ్డి క్రైం: జిల్లాలోని నిరుద్యోగ యువతకు సెట్విన్ ద్వారా వివిధ వృత్తి విద్య కోర్సులలో శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ సయ్యద్ మొయిజుద్దీన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీసీఏ, పీజీడీసీఏ, టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, మగ్గం వర్క్, మెహందీ కోర్సులలో మూడు నెలల పాటు శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ఫీజులో 50 శాతం రాయితీ ఇస్తామని, ఉచితంగా స్టడీ మెటీరియల్ అందిస్తామని తెలిపారు. ఆసక్తి గల వారు ఇతర వివరాలకు 73861 80456, 79891 59121 ఫోన్ నంబర్‌లలో సంప్రదించాలని సూచించారు.

మైనారిటీ కళాశాలల ప్రిన్సిపాళ్లపై వేటు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి, లింగంపేట మైనారిటీ గురుకుల కళాశాలల ప్రిన్సిపాల్స్‌ను విధుల నుంచి తొలగించినట్లు ఉమ్మడి జిల్లా మైనారిటీ కళాశాలల రీజనల్ కన్వీనర్ బషీర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎల్లారెడ్డి మైనారిటీ కళాశాల ప్రిన్సిపాల్ సయ్యద్ మసూద్ అహ్మద్‌ను తొలగించి ఆయన స్థానంలో చందూర్ మైనారిటీ కళాశాలలో జూనియర్ లెక్చరర్‌గా పనిచేస్తున్న సుధీర్ కుమార్‌ను నియమించామని పేర్కొన్నారు. అలాగే లింగంపేట మైనారిటీ కళాశాల ప్రిన్సిపాల్ ఆకుల కిషన్‌ను తొలగించి ఆయన స్థానంలో పీజీ టీచర్ గోపాల్‌కు బాధ్యతలు అప్పగించామని తెలిపారు. కళాశాల నిర్వహణ, కొత్త విద్యార్థుల అడ్మిషన్ల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు వారిపై చర్యలు తీసుకున్నామని వివరించారు.

భారీ వర్షం



కామారెడ్డి టౌన్/లింగంపేట/తాడ్వాయి: జిల్లాలోని పలు ప్రాంతాలలో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వాన పడడంతో రోడ్లపై వరద నీరు ప్రవహించింది. వర్షంతో జిల్లాకేంద్రంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. జేపీఎన్‌రోడ్, సుభాష్‌రోడ్, నిజాంసాగర్ చౌరస్తా, పోలీస్ స్టేషన్, రైల్వేస్టేషన్, అయ్యప్పనగర్, విద్యానగర్ కాలనీలో రోడ్లు చెరువులను తలపించాయి. లింగంపేట, తాడ్వాయి మండలాల్లోనూ భారీ వర్షం కురిసింది. దీంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

13న పెన్షన్ అదాలత్

సుభాష్‌నగర్: ఉద్యోగుల పెన్షన్ స్కీంలో పెన్షనర్ల సమస్యలకు సంబంధించి ఈనెల 13న ఉదయం 11 నుంచి 11.40 గంటల వరకు పరిష్కారానికి సంబంధించిన ఫిర్యాదులతో వీడియో కాన్ఫరెన్స్‌లో పెన్షన్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రీజినల్ పీఎఫ్ కమిషనర్–1 గణేశ్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫిర్యాదుదారులు Webex వెబ్‌సైట్‌లో మీటింగ్ సెంటర్ 2641 765 4272, పాస్‌వర్డ్ పీఈఎస్1234 ఎంటర్ చేసి కాన్ఫరెన్స్‌లో పాల్గొనాలని ఆయన సూచించారు.

బడికి వేళాయె!

- నేడు పాఠశాలలు పునఃప్రారంభం
- పూర్తి కాని 'మన ఊరు– మన బడి' పనులు
- 'అమ్మ ఆదర్శ పాఠశాల'ల్లోనూ నామమాత్రంగానే పనులు
- పూర్తి స్థాయిలో సరఫరా కాని బుక్స్, యూనిఫామ్స్
- షరామామూలుగా స్వాగతం పలకనున్న సమస్యలు

వేసవి సెలవులు ముగియడంతో బుధవారం పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. షరా మామూలుగానే ఈసారీ విద్యార్థులకు సమస్యలు స్వాగతం పలకనున్నాయి. పారిశుధ్య కార్మికులు లేకపోవడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. శిథిలావస్థకు చేరుకున్న గదులు.. అధ్వానంగా ఉన్న మూత్రశాలలు, మరుగుదొడ్లు.. అందని యూనిఫాంలు, పుస్తకాలు.. టీచర్ల కొరత.. ఇలా ఎన్నో సమస్యలు పాఠశాలల్లో కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి.



జిల్లాకేంద్రంలోని గంజ్ ఉన్నత పాఠశాల ఆవరణలో పేరుకుపోయిన చెత్తాచెదారం

కామారెడ్డి టౌన్: జిల్లాలో 1,011 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 697 ప్రాథమిక, 126 ప్రాథమికోన్నత, 188 ఉన్నత పాఠశాలలున్నాయి. వీటిలో 93,542 మంది విద్యార్థులు చదువుతున్నారు. అలాగే గురుకులాలు ఇతర విద్యాలయాల్లో మరో 32,120 మంది విద్యార్థులున్నారు. చాలా పాఠశాలల్లో గదులు శిథిలావస్థలో ఉన్నాయి. ఉపాధ్యాయుల కొరత, తాగునీటి సమస్యలు వేధిస్తున్నాయి. జిల్లాలో 4,943 ఉపాధ్యాయ పోస్టులకుగాను 4,076 మంది ఉపాధ్యాయులే ఉన్నారు.

జిల్లాలో ఒక్కరే రెగ్యులర్ ఎంఈవో ఉండగా మిగతా మండలాలకు సీనియర్ హెచ్‌ఎంలు ఇన్‌చార్జి ఎంఈవోలుగా వ్యవహరిస్తున్నారు. 62 శాతం స్కూల్‌లలో మరుగుదొడ్లు, మూత్రశాలలు, వంటశాలలు అధ్వానంగా ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయి. స్కావెంజర్లు లేకపోవడంతో పాఠశాలల్లో చెత్తాచెదారం శుభ్రం చేసేవారు కరువయ్యారు. చాలాచోట్ల పాఠశాలల ఆవరణలో పిచ్చిమొక్కలు, గడ్డి పెరిగాయి. బాత్‌రూంలు, మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి.

అరకొరగానే పుస్తకాలు..

పాఠశాలల పునఃప్రారంభం రోజునే విద్యార్థులకు పుస్తకాలతో పాటు ఏకరూప దుస్తులను పంపిణీ చేయాలని సర్కారు ఆదేశించింది. అయితే ఇంకా సగం యూనిఫామ్‌లు కూడా కట్టలేదని తెలుస్తోంది. జిల్లాలో 86,611 మంది విద్యార్థులకు రెండు జతల చొప్పున ఏక రూప దుస్తులు పంపిణీ చేయాల్సి ఉంది. ఇప్పటివరకు 50 శాతం దుస్తులు కూడా కుట్టలేదని తెలుస్తోంది. జిల్లాలో ప్రభుత్వ విద్యార్థులకు 7,73,610 పాఠ్య పుస్తకాలు అవసరం ఉన్నాయి. ఇప్పటివరకు 5,82,590 మాత్రమే జిల్లాకు చేరాయి. వీటిలో జిల్లాలోని అన్ని మండల కేంద్రాలకు 50 శాతం వరకు చేరుకున్నాయి. వీటిని పాఠశాలలకు తరలించాల్సి ఉంది. ఈనెలాఖరు వరకు పూర్తిస్థాయిలో పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేస్తామని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

లక్ష్యం చేరుకోని బడిబాట

బడిబాట కార్యక్రమం జిల్లాలో నామమాత్రంగానే జరుగుతోంది. జూన్ 6న బడిబాట ప్రారంభించారు. 19వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంది. ఈ కార్యక్రమంలో భాగంగా 12 వేల మంది విద్యార్థులను స్థానిక ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్న లక్ష్యం కాగా.. ఇప్పటి వరకు బడి బయట పిల్లలను 1,180 మందిని మాత్రమే చేర్పించారు. అలాగే అంగన్‌వాడీల నుంచి ఐదేళ్ల పిల్లలను గుర్తించి సమీప సర్కారు బడుల్లో ఒకటో తరగతిలో 2,300 మందిని చేర్పించారు. 2 నుంచి9 తరగతుల్లో 1200 మంది చేరారు. కొన్ని గ్రామాల్లో బడిబాటలో ఉపాధ్యాయులకు చుక్కెదురైంది. గ్రామంలో ప్రచారం చేస్తున్న తరుణంలో మొదటగా సర్కారు ఉపాధ్యాయులు తమ పిల్లలను ప్రైవేట్ స్కూళ్లకు కాకుండా ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని కొందరు తల్లిదండ్రులు డిమాండ్ చేశారు.

పూర్తి కాని పనులు

గత ప్రభుత్వం మౌలిక వసతుల కల్పన కోసం 'మన ఊరు–మన బడి' కింద జిల్లాలో 351 పాఠశాలలను ఎంపిక చేసి పనులు చేపట్టింది. వీటికోసం రూ. 165 కోట్లు మంజూరు చేసింది. 30 పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తయ్యాయి. 126 పాఠశాలల్లో పనులు చివరి దశలో ఉండగా, మరో 153 చోట్ల పనులు కొనసాగుతున్నాయి. 42 పాఠశాలల్లో ఇంకా పనులు ప్రారంభమే కాలేదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక అమ్మ ఆదర్శ పాఠశాల పేరుతో కొన్ని బడుల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టింది. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేసిన సర్కారు.. జిల్లాలోని 1,040 ప్రభుత్వ పాఠశాలల్లో అత్యవసరమైన మౌలిక వసతులతోపాటు చిన్నచిన్న మరమ్మతులు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, బాత్‌రూంలు, మరుగుదొడ్ల మరమ్మతులు చేపట్టింది. ఈ పనుల కోసం 25 శాతం నిధులను అడ్వాన్స్‌గా విడుదల చేసింది. పాఠశాలలు పునఃప్రారంభం అయ్యేనాటికి పూర్తి చేయాలని సర్కారు ఆదేశించినా చాలాచోట్ల ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి.

సర్కారు బడుల్లో చేర్పించాలి

సర్కార్ స్కూళ్లలో నాణ్యమైన మధ్యాహ్న భోజనంతో పాటు ఉచితంగా పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేస్తున్నాం. సీనియర్ ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తున్నారు. తల్లిదండ్రులు దీనిని గమనించి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి.

– ఎస్.రాజు, డీఈవో, కామారెడ్డి

అమ్మ ఒడి నుంచి బడికి..

- తొలిరోజు తీపి గురుతులెన్నో..
- ఉన్నత జీవితానికి బాటలు పడిందప్పుడే
- 'సాక్షి'తో కలెక్టర్, అదనపు కలెక్టర్

సాక్షి, కామారెడ్డి: నవమాసాలు మోసి కనిపెంచిన తల్లి తన బిడ్డకు మంచి భవిష్యత్తు ఇవ్వాలని ఆరాటపడుతుంది. ఒడిలో పడుకోబెట్టుకుని చందమామ కథలు చెబుతూ కడుపు నింపే ప్రయత్నం చేస్తుంది. బుడిబుడి అడుగులు వేస్తున్నపుడు జ్ఞానోపదేశం చేస్తూ మొదటి గురువవుతుంది. ఐదేళ్లు రాగానే చదువుకొమ్మంటూ బడికి పంపిస్తుంది. ప్రతి తల్లి తన బిడ్డల భవిష్యత్తు కోసం ఎన్నో కలలు కంటుంది. తొలి రోజు కొత్త బట్టలు తొడిగి, ముస్తాబు చేసి చంకనెత్తుకుని బడికి తీసుకువెళుతుంది. అమ్మను వదిలి ఉండలేక బిడ్డ ఏడుస్తుంటే.. అక్కడే కొంతసేపు కూర్చుని బిడ్డను స్కూలుకు అలవాటు చేస్తుంది. అలా రోజూ బడికి తీసుకువెళ్లి బిడ్డ పలకాబలపం పట్టుకుని అక్షరాలు దిద్దుతుంటే మురిసిపోతుంది. ఆనాటి తల్లులే కాదు.. నేటి తరం తల్లులు కూడా పిల్లల చదువుల బాధ్యతలను మోస్తున్నారు. చిన్ననాడు బడిబాట పట్టిన తొలిరోజు అనుభూతులను కలెక్టర్ జితేష్ వి పాటిల్, అదనపు కలెక్టర్ చంద్రమోహన్ 'సాక్షి'తో పంచుకున్నారు.

అమ్మ తీసుకెళ్లి కూర్చోబెట్టింది



నాన్న కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన అణుశక్తి సంస్థలో ఉద్యోగం చేసేవారు. మైసూర్‌లో ఉద్యోగం చేస్తున్నప్పుడు నన్ను అదే సంస్థకు చెందిన కేంద్ర ప్రభుత్వ పాఠశాలకు అమ్మ తీసుకువెళ్లింది. బడిలో చేర్చి నా కోసం అక్కడే ఎదురుచూసింది. స్కూల్ వాతావరణం అలవాటయ్యేదాకా నాతో వచ్చేది. నాన్నకు ముంబయికి బదిలీ అయ్యింది. అక్కడ కేంద్ర ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో చదివాను. ఐఐటీ సీటు రావడంతో ఇంజినీరింగ్ పూర్తి చేసి సివిల్స్ రాసి ఐఏఎస్ అయ్యాను. ప్రతి ఒక్కరి జీవితంలో అమ్మ, నాన్న ఎంతో ముఖ్యమైన పాత్ర పోషిస్తారు. పిల్లల భవిష్యత్తు కోసం నిరంతరం శ్రమిస్తారు. అమ్మానాన్నలు కోరుకున్న విధంగా ఉన్నతంగా ఎదిగాను. తల్లిదండ్రుల కలలను నెరవేర్చడానికి అందరూ కృషి చేయాలి.

– జితేష్ వి పాటిల్, కలెక్టర్

అక్కతో కలిసి బడికి వెళ్లా



హైదరాబాద్‌లోని గౌలిగూడ చమన్ ఆంజనేయస్వామి ఆలయంలో శారదమ్మ అనే టీచర్ ఖానిగి బడి నడిపేవారు. అక్కడికి సమీపంలోనే మేం ఉండేది. అక్కయ్య చంద్రరేఖ నాకన్నా ఏడాదిన్నర పెద్ద. ఆమెతో కలిసి మూడేళ్ల వయసులో బడిలో అడుగుపెట్టాను. శారదమ్మ టీచర్ పలక మీద ఓనమాలు పెట్టిస్తే బలపంతో దిద్దా. అక్కయ్య ఉండడం వల్ల నాకు ఇబ్బంది ఏమీ లేకుండే. అన్నీ తానే చూసుకునేది. ఏడాది తర్వాత నన్ను మా సొంతూరు మంథనిలో నానమ్మ, తాతయ్య దగ్గరకు తీసుకువెళ్లారు. అక్కడే చదువుకోవాలన్నారు. మా వీధిలోనే బ్రాంచి బడి ఉండేది. అందులో చదివాను. హెచ్‌ఎస్‌సీ కూడా అక్కడే పూర్తయ్యింది. చదువంతా ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ కాలేజీల్లోనే జరిగింది. డిగ్రీకి హైదరాబాద్ వెళ్లాను. డిగ్రీ పూర్తిచేసి సుమారు నాలుగు దశాబ్దాలవుతోంది. ఈ మధ్యే డిగ్రీ దోస్తులం కలుసుకున్నాం. ప్రతి ఒక్కరికీ పసి ప్రాయంలో ఎన్నో అనుభూతులు ఉంటాయి. నాకూ అలాగే ఎన్నో ఉన్నాయి. ప్రతి ఒక్కరూ చదువు మీద శ్రద్ధ పెడితే ఉన్నతంగా ఎదగవచ్చు.

– చంద్రమోహన్, అదనపు కలెక్టర్



ముదాంగల్లిలోని పాఠశాలలో ధ్వంసమైన కిటికీ,



హరిజనవాడ హైస్కూల్‌లో ఊడిపోయిన డోర్

జూనియర్ కళాశాలగా అతిథి గృహం



ప్రభుత్వ జూనియర్ కళాశాలగా మారనున్న పంచాయతీరాజ్ అతిథి గృహం

నిజాంసాగర్(జుక్కల్) : మండలకేంద్రంలో నూతనంగా నిర్మించిన పంచాయతీరాజ్ అతిథి గృహం ప్రభుత్వ జూనియర్ కళాశాలగా మారనుంది. పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందించడం లక్ష్యంగా ప్రభుత్వపరంగా జూనియర్ కళాశాల అందుబాటులోకి రానుంది. ఈ విద్యాసంవత్సరం నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ తరగతులు ప్రారంభం కానుండటంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కళాశాలను వినియోగించుకోవాలి

పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ప్రభుత్వపరంగా జూనియర్ కళాశాలను ప్రారంభిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కొత్త గెస్ట్‌హౌస్ భవనాన్ని ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాంతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ ఏడాది నుంచే విద్యాబోధన ఉంటుందన్నారు. హెచ్ఈసీ, సీఈసీ, ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో అడ్మిషన్లు పొందాలన్నారు. వారివెంట కాంగ్రెస్ నాయకులు అనీస్, రాములురాథోడ్, రమేష్, ప్రవీన్ తదితరులున్నారు.

నేడు ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభం

నిజాంసాగర్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన పంచాయతీరాజ్ అతిథి గృహంలో బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలను జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. గతేడాది ప్రభుత్వ పరంగా జూనియర్ కళాశాల మంజూరైనా అడ్మిషన్లకు విద్యార్థులు ముందుకు రాలేదు. అంతేకాకుండా ప్రైవేట్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు అడ్మిషన్లు పొందటంతో నిజాంసాగర్‌లో జూనియర్ కళాశాల ప్రారంభం కాలేదు. కాని ఈ ఏడాది నుంచి ఇంటర్ తరగతుల నిర్వహణ కోసం ఇంటర్ అధికారులు దృష్టి సారించారు. ఇందుకుగాను పంచాయతీ రాజ్ అతిథి గృహన్ని కళాశాల కోసం ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు కేటాయించారు. దాంతో సదరు అతిథి గృహం నందు ఇంటర్ తరగతుల నిర్వహణ, కళాశాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు.

'రైతు నేస్తం' సద్వినియోగం చేసుకోవాలి

- సాగులో మెలకువలు పాటించాలి
- కలెక్టర్ జితేష్ వి పాటిల్



ఎర్రాపహాడ్‌లో రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

తాడ్వాయి: రైతు నేస్తం కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. మంగళవారం ఆయన ఎర్రాపహాడ్ రైతు వేదికను సందర్శించారు. రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు వ్యవసాయంతో పాటు అనుబంధంగా చేపలు, పాడి పశువుల పెంపకంపై దృష్టి సారించాలన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి పొందేందుకు నూతన విధానాలు అవలంబించాలన్నారు. వర్షం నీటిని నిల్వ చేసుకునేందుకు ఫాంపాండ్‌ల నిర్మాణానికి రైతులు ముందుకు రావాలని సూచించారు. రైతునేస్తంలో భాగంగా ప్రతి మంగళ, శుక్రవారాల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సలహాలు, సూచనలు ఇస్తున్నారన్నారు. ఈ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రహీమొద్దీన్, ఎంపీడీవో సాజిద్ అలీ, ఏవో శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఉన్న తరగతి గదులను కూల్చేయండి



శెట్పల్లి సంగారెడ్డిలో తరగతి గదులను పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

లింగంపేట: ఇటీవల వర్షానికి దెబ్బతిన్న తరగతి గదులను కూల్చివేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. శెట్పల్లి సంగారెడ్డి ఉన్నత పాఠశాల భవనం శిథిలావస్థకు చేరిన విషయాన్ని గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన మంగళవారం పాఠశాలను సందర్శించారు. ప్రస్తుతం ఉన్న రెండు గదులకు మెంబ్రేన్ షీట్(డాంబర్ షీట్) వేయాలని సూచించారు. మరో రెండు గదుల స్లాబ్ తీసేసి జీఐ షీట్లు వేయాలని ఆదేశించారు. కూలిపోయే దశలో ఉన్న మరో ఐదు గదులను కూల్చివేయాలని ఏఈకి సూచించారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖ డీఈఈ వెంకటేశ్వర్లు, ఏఈ కన్నయ్యరాజు, ఎంఈవో రామస్వామి, హెచ్‌ఎం శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి

- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ



అధికారులతో మాట్లాడుతున్న షబ్బీర్ అలీ

కామారెడ్డి క్రైం: జిల్లాలో తాగు నీటి సమస్య తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్, జిల్లా పంచాయతీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరచూ జీపీఆర్ పైప్‌లైన్ లీకేజీలతో నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. పైప్‌లైన్ లీకేజీలను ఎప్పటికప్పుడు గుర్తించి అరికట్టాలన్నారు. పట్టణ భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఇందల్వాయి నుంచి మల్లన్నగుట్ట వరకు రూ.195 కోట్లతో 24.7 కిలోమీటర్ల మేర నూతన పైప్‌లైన్ నిర్మించనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన పనులు ఆరు నెలల్లో పూర్తయ్యేలా చూస్తానన్నారు. కామారెడ్డి మున్సిపాలిటీలో మంచినీటి సరఫరాకు రూ.93 కోట్లతో రూపొందించిన కార్యక్రమానికి త్వరలో అగ్రిమెంట్ పూర్తి చేస్తామన్నారు.

మున్సిపాలిటీ విద్యుత్ బకాయిలు రూ. 21 ఉన్నాయని, ఇందులో ఫిల్టర్ బెడ్‌ల ద్వారా మంచి నీటి సరఫరాకు చెందినవే రూ.17 కోట్లని అధికారులు ప్రభుత్వ సలహాదారుతో పేర్కొన్నారు. సోలార్ యూనిట్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించాలని, నీటి పన్ను వసూళ్లపై ప్రత్యేక దష్టి సారించాలని ఆయన అధికారులకు సూచించారు. టీఎఫ్ఐడీసీ కింద కామారెడ్డి బల్దియా పరిధిలో రూ. 24 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామని షబ్బీర్‌అలీ తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో కలుషిత నీరు సరఫరా అవుతుందనే ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. కాళేశ్వరం 22 వ ప్యాకేజీలో ఈ సంవత్సరంలో చేపట్టే పనులు, పెండింగ్ బిల్లులకు సంబంధించి రూ.375 కోట్ల మంజూరుకు ప్రతిపాదనలు పంపాలని ఇరిగేషన్ ఈఈ విద్యావతికి సూచించారు. సమావేశంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మిషన్ భగీరథ ఎస్ఈ రాజేంద్రకుమార్, ఈఈలు స్వప్న, నరేష్ కుమార్, రమేష్, పబ్లిక్ హెల్త్ ఈఈ తిరుపతి కుమార్, డీపీవో శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి అండగా ఎమ్మెల్యే

- వేతనంలోంచి రూ. 4 లక్షలు అందజేత
- హామీ నిలబెట్టుకున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే



కార్యకర్త కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

గాంధారి: ఎమ్మెల్యేగా గెలిపిస్తే వేతనంలోంచి ఒక్క రూపాయి మాత్రమే తాను తీసుకుంటానని, మిగతా మొత్తాన్ని నియోజకవర్గానికి ఖర్చు చేస్తానని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు నిలబెట్టుకున్నారు. కార్యకర్త కుటుంబానికి రూ. 4 లక్షలు ఇచ్చేశారు. వివరాలిలా ఉన్నాయి. సర్వాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త వెంకటి ఇటీవల మరణించాడు. ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు మంగళవారం ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. వారు పూరి గుడిసెలో నివసిస్తుండడంతో పక్కా ఇంటి నిర్మాణం కోసం తన వేతనాన్ని అందిస్తున్నట్లు ప్రకటించారు. తన వేతనంలోంచి రూ. 4 లక్షలు వెంకటి కుటుంబ సభ్యులకు అందించారు. ఇంటి నిర్మాణానికి అవసరమయ్యే కంకర, ఇసుకను సమకూర్చడానికి సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను మాట మీద నిలబడే వ్యక్తినన్నారు. తన వేతనాన్ని నియోజకవర్గంలో అవసరం ఉన్న చోట, అభివృద్ధికి ఖర్చు చేస్తానని పేర్కొన్నారు.

క్లుప్తంగా

మోడల్‌లో స్కూల్‌లో ఖాళీలు

మద్నూర్(జుక్కల్) : మండలంలోని మేనూ ర్‌లోని మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు సీట్లు ఖాళీగా ఉన్నాయని పాఠశాల ప్రిన్స్‌పాల్ జ్యోతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మోడల్ స్కూల్‌లో ప్రవే శాల కోసం ఆసక్తి గల విద్యార్థులు దరఖా స్తులు చేసుకోవాలన్నారు. 6వ తరగతిలో 38, 7లో 42, 8లో 16, 9లో 31, 10వ తరగతిలో 29 సీట్లు ఖాళీగా ఉన్నాయని ఆమె తెలిపారు. అలాగే ఇంటర్ ఫస్టియర్‌లోని ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో సైతం సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు.

మత్స్యకారుల సహకార సంఘం సమావేశం



కామారెడ్డి క్రైం : కామారెడ్డి జిల్లా మత్స్యకారుల సహకార సంఘం నూతన భవనం నిర్మాణం కోసం అవసరమైన నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర మత్స్య శాఖ కమిషనర్‌ను కోర నున్నట్లు జిల్లా అధ్యక్షుడు గాదం సత్యనారా యణ అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో జిల్లా మత్స్యకారుల సహకార సంఘం మొదటి కార్యవర్గ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ, మత్స్యకారు లకు అందే వివిధ సంక్షేమ పథకాలపై, జిల్లా మత్స్య సహకార సంఘం కామారెడ్డి పేరుతో నూతన ఉమ్మడి సేవింగ్స్ ఖాతాను ప్రారంభిం చే విషయంపై సభ్యులతో చర్చించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో మత్స్యకారుల సహకార సంఘం మేనేజింగ్ డైరెక్టర్ కె. వర దారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు పసుపుల సాయిలు, డైరెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన గిరిజనులు



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని ముం బోజీపేట తండాలో మంగళవారం గిరిజనులు మొక్కలు నాటారు. అటవీ శాఖ బీట్ అధికారి మౌనిక ఆధ్వర్యంలో తండావాసులు 200 మొక్కలు నాటారు. ప్రతీఇంటి ఎదుట మొక్కలు నాటాలని సూచించారు. కార్య క్రమంలో తండా పెద్దలు నరేష్, మాజీ సర్పం చ్ బలరాంనాయక్, వెంకట్‌రామ్, గోవింద్, శుభాష్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఊడ్చేదెవరు.. కడిగేదెవరు

- నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం
- స్కావెంజర్లు, స్వీపర్లు లేక ఇబ్బందులు



ముదాంగల్లిలోని బాలిక పాఠశాలలో అధ్వానంగా ఉన్న బాత్‌రూంలు



జిల్లా కేంద్రంలోని గంజ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అధ్వానంగా ఉన్న బాత్‌రూంలు

సాక్షి, కామారెడ్డి : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించే ఉద్దేశంలో ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ కమిటీల ఆధ్వర్యంలో ఆయా పాఠశాలల్లో టాయిలెట్ల నిర్మాణాలు, మరమ్మతులు, విద్యుత్ సౌకర్యం కల్పిం చడం, ఫ్యాన్ల ఏర్పాటు వంటి పనులు చేపట్టారు. జిల్లాలో 1,013 ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల కల్ప నకు రూ. 20 కోట్లు అవసరం అవుతాయని అంచనా వేశారు. మొదటి విడతలో రూ. 5.05 కోట్లు విడుదల చేశారు. ఆయా పనులు కొనసాగుతున్నాయి. స్కూళ్లు తెరిచేలోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించినప్ప టికీ చాలాచోట్ల పనులు పూర్తి కాలేదు. ఇంతవరకు బానే ఉన్నా.. స్కూళ్లలో గదులు ఊడ్చడంతోపాటు మూత్రశాలలు, మరుగుదొడ్లు శుభ్రం చేయడానికి స్కావెంజర్లు గానీ, స్వీపర్లు గానీ లేకపోవడం పెద్ద సమస్యగా మారింది. గతంలో పాఠశాలల్లో స్కావెం జర్లు ఉండేవారు. వారితో ఆయా పనులన్నీ చేయించే వారు. గత ప్రభుత్వం వారిని తొలగించింది. గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీలు, పట్టణ ప్రాంతాల్లో మున్సిపాలిటీలు పాఠశాలల్లో పారిశుధ్యం సమస్యను చూసుకోవాలని ఆదేశించింది. చాలా గ్రామాల్లో, పట్ట ణాల్లో పారిశుధ్య సిబ్బంది తక్కువగా ఉండడంతో పాఠశాలలకు పంపడానికి పంచాయతీలు, మున్సిపా లిటీలు ఆసక్తి చూపడం లేదు. తమకే తక్కువగా ఉన్నా రంటూ స్కూళ్లను పట్టించుకోవడం లేదు. దీంతో స్కూళ్లు మురికికూపంగా మారుతున్నాయి.

సిబ్బంది లేక ఇబ్బంది..

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వం ఇదే సమయంలో స్కావెంజర్లు, స్వీపర్లను నియమించకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతు న్నాయి. బడుల్లో పారిశుధ్య సమస్యను పంచా యతీలు, మున్సిపాలిటీలు పట్టించుకోకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. సిబ్బంది నియామానికి ఇబ్బందులు ఉంటే కనీసం అవసర మైన మేర నిధులు కేటాయిస్తే, స్థానికంగా అందు బాటులో ఉండే వారితో పనులు చేయించుకునే వీలుంటుంది. వెంటనే పాఠశాలల్లో అవసరమైన సిబ్బందిని నియమించాలని విద్యార్థుల తల్లిదం డ్రులు కోరుతున్నారు.



ముదాంగల్లీలోని బాలికల పాఠశాలలో చెత్తాచెదారం

కార్మికులను నియమించాలి



గతంలో ప్రభుత్వ పాఠ శాలల్లో ఔట్‌సోర్సింగ్ పద్ధ తిలో పారిశుధ్య కార్మికులు పనిచేసేవారు. వారిని తొల గించడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రభుత్వం తక్షణమే స్పందించి, పాఠశాలల్లో పారి శుధ్య కార్మికులను నియమించాలి.

– అనిల్‌కుమార్, టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

సమస్యలు పరిష్కరించాలి



ప్రభుత్వం విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి. సర్కారు బడుల్లోని మరుగుదొడ్లు, బాత్‌రూంలు అధ్వానంగా ఉన్నాయి. వాటికి అవసరమైన మరమ్మ తులు చేయించాలి. విద్యారంగ సమస్యలు పరిష్క రించకపోతే ఆందోళనలకు దిగుతాం.

– చరణ్, ఏబీవీపీ జిల్లా కన్వీనర్

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి కలెక్టరేట్‌లో మంగ ళవారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖ లపై ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ సమీక్షించిన అనంతరం ఆయనను మర్యాద పూర్వకంగా కలసి తమ సమస్యలను విన్నవించినట్లు టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి, కార్యదర్శి బి.సా యిలు తెలిపారు. జిల్లాలో వివిధ శాఖలోని ఉద్యో గుల సమస్యలను ప్రభుత్వ సలహాదారు దృష్టికి తీసుకుపోయి పరిష్కరించాలని కోరినట్టు చెప్పారు. సంఘం నాయకులు బి రాజేశ్వర్, సంతోష్‌కుమార్, కే శివకుమార్ తదితరులున్నారు.

యూనిఫాంలు త్వరగా అందించాలి



బాన్సువాడ రూరల్: పాఠశాలల పునః ప్రారంభ స మయం వచ్చేసినందున టైలర్లు త్వరగా యూ నిఫాంలు కుట్టి తమకు అప్పగించాలని బాన్సువాడ ఎంపీడీవో బషీరుద్దీన్ సూచించారు. మంగళవారం ఆయన తాడ్కోల్ గ్రామంలో పర్యటించి స్కూల్ యూనిఫాంలు కుట్టే టైలర్లకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థు లకు ఉచితంగా అందించే యూనిఫారంలను కొ లతల ప్రకారం నాణ్యమైన దారంతో కుట్టాల న్నారు.పంచాయితీ కార్యదర్శి ప్రశాంతి , కారోబారి హన్మాండ్లు ఉన్నారు.

నేడు సిద్ధరామేశ్వరాలయ భూములపై సమావేశం

భిక్కనూరు : దక్షిణ కాశీగా పేరొందిన భిక్క నూరు సిద్ధరామేశ్వరాలయానికి సంబంధిం చిన భూముల్లో కొందరూ అక్రమంగా కట్టడా లను నిర్మిస్తున్నారని వీటిని అడ్డుకునేందుకు ఈనెల 12వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు సిద్ధరామేశ్వరాలయంలో ప్రజల సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు శ్రీరామదండు, బజరంగ్‌దళ్, హిందూవాహిని ప్రతినిధులు మంగళవారం తెలిపారు. ఈ సమావేశానికి ప్రజలు అధిక సంఖ్యలో హాజరై ఆలయ భూముల పరిరక్షణకు కృషిచేయాలన్నారు. అక్రమ కట్టడాల విషయమై గతంలో దేవాదా యశాఖ అధికారుల దృష్టికి తీసుకొచ్చినప్ప టికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. అం దుకే ప్రజలతో సమావేశాన్ని నిర్వహిస్తున్నామ న్నారు. ప్రజలు అధిక సంఖ్యలో ఈ సమావేశానికి హాజరై సిద్ధరామేశ్వర స్వామి భూములను ఆస్తులను కాపాడాలని వారు కోరారు.

ఏసీజీఈకు సన్మానం



ఏసీజీఈ బలరాంను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కామారెడ్డి టౌన్ : జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ గవర్న మెంట్ ఎగ్జామ్స్(ఏసీజీఈ) అధికారిగా నూతనంగా నియమితులైన బలరాంను జిల్లా ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం(జీటీఏ) ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు మంగళ వారం ఆయన్ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్ర మంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బాలరాజు, ప్రధాన కార్యదర్శి యాదయ్య, కోశాధికారి అనంత రాజు, కార్య దర్శి రమేష్, కార్యవర్గ సభ్యులు అనిల్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న మిషన్ భగీరథ పథకం సర్వే



గర్గుల్‌లో మిషన్ భగీరథ సర్వేను పరిశీలిస్తున్న ఎంపీవో మలహరి

కామారెడ్డి రూరల్ : కామారెడ్డి మండలం గర్గుల్ గ్రామంలో కొనసాగుతున్న మిషన్ భగీరథ పథకం సర్వేను మంగళవారం ఎంపీవో మలహరి పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఇంటింటా సర్వే చేయాలని ఎంపీవో సూచించారు. ప్రతి గ్రామంలోని ఇంటిం టికి వెళ్లి మిషన్ భగీరథ పథకం పరిశీలించడంతో పాటు సంబంధిత వ్యక్తుల వివరాలను యాప్‌లో నమోదు చేయాలన్నారు. జీపీలో కుడుతున్న యూనిఫార్మ్ సెంటర్‌ను పరిశీలించారు. గ్రామ కార్యదర్శి శోభ తదితరులు ఉన్నారు.

క్రైం కార్నర్

ఒడ్డు పైనుంచి పడి కూలీ మృతి



గంగయ్య మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

భిక్కనూరు: వ్యవసాయభూమిలోని ఒడ్డు పైనుంచి పడి వ్యవసాయకూలీ మృతి చెందిన సంఘటన మండలంలోని పెద్దమల్లారెడ్డిలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన రైతు శ్రీనివాస్ వ్యవసాయక్షేత్రంలో కూలీ పనికి రాచకొండ గంగయ్య (65) సోమవారం వెళ్లాడు. ఆయన ఇంటికి తిరిగిరాకపోవడంతో కు టుంబ సభ్యులతోపాటు రైతు శ్రీనివాస్ పలుచోట్ల వెతి కారు. మంగళవారం ఉదయం వ్యవసాయక్షేత్రానికి వెళ్లి చూడగా ఒడ్డు పైనుంచి బోర్లాపడి మృతి చెంది ఉన్నా డు. మృతుడి కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పరిస్థితి విషమించి గుర్తు తెలియని వ్యక్తి..

కామారెడ్డి క్రైం: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. అడ్లూర్ శివారులోని బ్రిడ్జి వద్ద మంగ ళవారం గుర్తు తెలియని వ్యక్తి అపస్మారకస్థితిలో పడి ఉం డటాన్ని గమనించిన స్థానికులు దేవునిపల్లి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని సదరు వ్యక్తిని ఏరియా ఆస్పత్రికి తరలించగా కొద్దిసేపటికే మృతి చెందాడు. మృతుడి వయస్సు 40 నుంచి 45 ఏళ్లు ఉంటుందని, ఎలాంటి ఆధారాలు లభిం చలేదని ఎస్సై రాజు తెలిపారు. అనారోగ్య కారణాలతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నామన్నారు.

తల్లీకొడుకుల హత్య కేసులో జీవిత ఖైదు

ఖలీల్‌వాడి: రూ.500 విషయంలో ఇద్దరు స్నేహితుల మధ్య గొడవ జరిగి తల్లి, కొడుకు హత్యకు గురైన కేసులో నేరస్తుడికి జీవితఖైదు విధిస్తూ నిజామాబాద్ జిల్లా సెషన్స్ జడ్జి సునీత కుంచాల మంగళ వారం తీర్పు చెప్పారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆర్మూర్ మం డలం మామిడిపల్లికి చెందిన శ్రీనివాస్‌కు అదే గ్రామానికి చెందిన అనిల్ గౌడ్‌తో కల్లు బట్టిలో పరిచయం ఏర్పడింది. అనిల్ గౌడ్ అవ సరం నిమిత్తం శ్రీనివాస్ నుంచి రూ.500 అప్పుగా తీసుకున్నాడు. అయితే తిరిగి ఇవ్వలేక పోయాడు. ఈ విషయమై ఇద్దరు అనేక సార్లు ఘర్షణకు దిగారు. ఈ క్రమంలో శ్రీనివాస్ 2021 నవంబర్ 7 న అనిల్ ఇంటికి వెళ్లి గొడ్డలితో వీరంగం చేశాడు. అనిల్ గౌడ్‌పై విచక్ష ణా రహితంగా దాడి చేశాడు. ఇద్దరి మధ్య ఘర్షణలోకి అడ్డు వెళ్లిన అనిల్ తల్లి రాజు బాయిపైన కూడా శ్రీనివాస్ దాడి చేయడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. కేసు నమోదు చేసిన ఆర్మూర్ పోలీ సులు దర్యాప్తు చేసి నిందితుడు శ్రీనివాస్ మీద అభియోగాలు నమోదు చేశారు. శ్రీనివాస్ అనేక కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు.

చోరీలకు పాల్పడిన వ్యక్తి అరెస్ట్

మద్నూర్(జుక్కల్): వరుస చోరీలకు పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ మంగళ వారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మద్నూర్‌కు చెందిన దరాస్ కిరణ్ ఇటీవల కాలం లో మండల కేంద్రంలోని వైన్‌షాపులో చోరీకి పాల్పడి రూ.23,200 ఎత్తుకెళ్లాడు. అనంతరం జాతీయ రహదారి పక్కన ఉన్న అయ్యప్ప ఆలయం తాళాలు పగలగొట్టి నాలుగు పంచలోహ విగ్రహాలను ఎత్తుకెళ్లి మహారాష్ట్రలోని దెగ్లూర్‌లో విక్రయించాడు. డోంగ్లీ మండలం మొగాలో పుల్లా వార్ లక్ష్మణ్ ఇంటి తాళాలను పగులగొట్టి బీరు వాలోని రూ.12 నగదును ఎత్తుకెళ్లాడు. మంగళ వారం దెగ్లూర్ వైపు నుంచి పెద్ద శక్కర్గా వైపు పెట్రో లింగ్ నిర్వహిస్తున్న పోలీసులను చూసి కిరణ్ పారి పోతుండగా అదుపులోకి తీసుకొని విచారించారు. దీంతో తానే ఇటీవల వరుస చోరీలకు పాల్పడినట్లు అంగీకరించాడు. నిందితుడిని రిమాండ్‌కు తరలిం చామని, పంచలోహ విగ్రహాలు కొనుగోలు చేసిన వ్యక్తి పరారీలో ఉన్నాడని ఎస్సై తెలిపారు.

కళాశాల కొనసాగింపు ప్రశ్నార్థకం?

- నూతన కళాశాలలో సిబ్బంది కరువు
- నేటి వరకు ఒక్క అడ్మిషన్ లేదు
- కళాశాల కొనసాగించేలా తీర్మానిస్తూ గ్రామస్తుల సమావేశం



సమావేశంలో పాల్గొన్న రాజకీయ నాయకులు, గ్రామస్తులు, కళాశాల సాధన సమితి సభ్యులు

బీబీపేట : గతేడాది బీబీపేట మండలంలో నూత నంగా ప్రారంభమైన ప్రభుత్వ జూనియర్ కళాశాల కొనసాగించడం ప్రశ్నార్థకంగా మారింది. కళాశా లలో ఒక్క లెక్చరర్ కూడా లేకపోవడం, భవనం లేకపోవడం తదితర కారణాలతో కళాశాల కొనసా గించడం కష్టంగా మారింది. అటు అధికారులు కానీ, ఇటు ప్రజాప్రతినిధులు కానీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో గతేడాది అడ్మిషన్ పొందిన ప్రస్తుతం సెకండియర్ విద్యార్థుల భవి ష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. దీంతో కళాశాల సాధన సమితి సభ్యులు మంగళవారం ఆయా రాజ కీయ నాయకులు, గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. కళాశాల ముందుకు సాగేలా చర్యలు తీసుకునేందుకు ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలనే అంశంపై సమావేశం ఏర్పాటు చేసు కొని చర్చించారు. ప్రస్తుతం కళాశాల కోసం సిబ్బం ది నియామకాల గురించి ప్రభుత్వం నోటిఫికేషన్ రాలేదని దీంతో ప్రైవేట్ లెక్చరర్స్‌ను నియమించు కుందామనే అంశంపై మాట్లాడారు. దాని కోసం అవసరమయ్యే డబ్బును చందాలు రూపంలో జమ చేయాలని పేర్కొన్నారు. గతేడాది కూడా ప్రైవేట్ లెక్చరర్స్‌ను నియమించామని అయినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని తెలిపారు. 45 మం ది విద్యార్థులు అడ్మిషన్ తీసుకుంటే అంతా ఫెయిల్ అయ్యారన్నారు. ప్రభుత్వం నుండే లెక్చరర్స్ ను నియమించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. దీనికోసం అఖిలపక్షంతో మరోసారి సమావేశం ఏర్పాటు చేసుకోవాలని నిర్ణ యించారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని వారి కోసం పని చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సాధన సమితి సభ్యులు, రాజకీయ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'నాట్ విల్లింగ్' ఇచ్చిన వారి పేర్లను తొలగించాలి



వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

నిజామాబాద్‌అర్బన్: రెండు సార్లు నాట్ విల్లింగ్ ఇచ్చిన టీచర్ల పేర్లను పదోన్నతుల సీనియారిటీ జాబితా నుంచి తొలగించాలని యూటీఎఫ్ నాయ కులు డీఈవోను కోరారు. ఈ మేరకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాట్ విల్లింగ్ ఆప్షన్ ఇచ్చిన ఉపాధ్యాయుల పేర్లను తొలగించి తదుపరి అర్హత కలిగిన ఉపాధ్యాయుల పేర్లను జాబితాలో చేర్చా లని కోరారు. అదేవిధంగా సబ్జెక్టుల వారీగా పదో న్నతుల కోసం ఏర్పడిన ఖాళీల సంఖ్యను విడుదల చేయాలన్నారు. డీఈవోను కలిసిన వారిలో సంఘం జిల్లా అధ్యక్షులు డి.సత్యానంద్, జిల్లా కార్యదర్శి జి ఆనందం, జిల్లా కమిటీ సభ్యులు ఈ శ్రీనివాస్, ఎం భాజన్న తదితరులు పాల్గొన్నారు.

23న స్పాట్ కౌన్సెలింగ్

నిజామాబాద్‌రూరల్: చంద్రశేఖర సరస్వతీ విశ్వ మహావిద్యాలయం (డీమ్డ్ యూనివర్సిటీ) కాంచీపు రం ఆధ్వర్యంలో ఈనెల 23న గంగాస్థాన్ ఫే స్-2లోని ఉత్తర తిరుపతి క్షేత్రం ఆవరణలో స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఆశ్రమ నిర్వా హకులు తెలిపారు. ఉదయం 10 నుంచి సాయం త్రం 5గంటల వరకు కౌన్సెలింగ్ కొనసాగుతుంద న్నారు. కంచి యూనివర్సిటీలో డొనేషన్లు, మేనేజ్ మెంట్ కోటా సీట్లు ఉండవని, విద్యార్థులు ఈ అవ కాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇం టర్మీడియెట్ మ్యాథ్స్, కెమిస్ట్రీ, ఫిజిక్స్ సబ్జెక్టులలో రెండేళ్ల మార్కుల ఆధారంగా డిగ్రీ మెరిట్‌ను గౌ రవిస్తూ అడ్మిషన్లు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఇం జినీరింగ్, బీబీఏ, బీసీఏ, ఎంబీఏ, ఎంసీఏ, బీఈడీ, డాటా సైన్స్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ టె క్నాలజీ కోర్సుకి సంబంధించి ట్రైనింగ్ అడిషనల్ డి గ్రీ సర్టిఫికేషన్ ఇవ్వబడుతుందన్నారు. పూర్తి వి వరాలకు కుప్ప జగన్నాథశర్మ (98496 58030), రవిచంద్ర (98667 65439), శ్రీపాద ఫణిచక్రవ ర్తి(98480 71008), గోపాలకృష్ణ శర్మ(94404 73706) సంప్రదించాలని, 16వ తేదీలోగా రిజిస్ట్రే షన్ చేసుకోవాలని కోరారు.

త్వరలోనే హరితహారం



మొక్కలను పరిశీలిస్తున్న అధికారులు

బాన్సువాడ రూరల్ : మోస్తారు వర్షాలు కురిసిన వెంటనే గ్రామాల్లో హరితహారం కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని ఎంపీడీవో బషీరుద్దీన్ అన్నారు. తాడ్కోల్ గ్రామంలో మంగళవారం ఆయన వన నర్సరీని పరిశీలించారు.ఎండ తగలకుండా షేడ్‌నె ట్స్ ఏర్పాటు చేయించాలని జీపీ కార్యదర్శి ప్రశాం తికి సూచించారు. కుళాయి సర్వేను పరిశీలించారు.

అదృశ్యమైన యువకుడు అడవిలో మృతి



జగదీశ్ (ఫైల్)

డిచ్‌పల్లి: జక్రాన్‌పల్లి మం డలంలోని కేశ్‌పల్లికి చెందిన యువకుడు మున్నూరు జగదీశ్(28) గత నెల 31న సాయంత్రం నుంచి కనిపిం చకుండాపోయాడు. అదే రోజు తల్లి బాలమణి ఫిర్యాదు చేయగా పోలీసులు దర్యాప్తు చేప ట్టారు. జగదీశ్ ఆచూకీ కోసం ఈనెల 2న అటవీ ప్రాంతంలో పోలీసులు డాగ్ స్క్వాడ్, డ్రోన్ కెమెరా సాయంతో గాలింపు చేపట్టినప్పటికీ ఆచూకీ లభించలేదు. అయితే, యానంపల్లి అటవీప్రాంతంలో మృతదేహాన్ని గమనించిన కొందరు పశువుల కాపర్లు మంగళవారం డిచ్‌ప ల్లి పోలీసులకు సమాచారం అందించారు. వెం టనే సీఐ మల్లేశ్‌తోపాటు ఎస్సై మహేశ్ సిబ్బం దితో కలిసి అటవీప్రాంతానికి చేరుకున్నారు. మృతుడిని జగదీశ్‌గా గుర్తించారు. మృతదేహం ఎముకలగూడుగా మారడంతో పంచనామా నిర్వహించి ఘటనాస్థలంలోనే పోస్టుమార్టం పూర్తి చేశారు. మృతుడి బావ బండారి సురేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కళ్లద్దాలు పడిపోవడంతో..!

అద్దాలు లేకపోతే జగదీష్‌కు కళ్లు కనిపించవని, చీకట్లో అద్దాలు పడిపోయి అతడు అడవిలో దారి తప్పి ఉంటాడని పోలీసులు తెలిపారు. మరుసటి రోజు వరకు తిరిగితిరిగి అలసిపోయి వడదెబ్బతో మృతి చెంది ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు.

భార్య తరఫువారు వేధిస్తున్నారని ఆత్మహత్య

ఖలీల్‌వాడి: భార్యతోపాటు అత్త, మామ, బావ తనను వేధిస్తున్నారని సూసైడ్ నోట్‌రాసి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. నగరంలోని నాల్గోటౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్సై సంజీవ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నసీం కాలనీకి చెందిన మహ్మద్ అన్వ ర్(35) ఏడు నెలల క్రితం తన భార్యతో గొడవప డ్డాడు. ఆ తరువాత ఆమె డెలివరీ కోసమని పుట్టిం కి వెళ్లింది. అప్పటి నుంచి అన్వర్ తన తల్లిదండ్రు లతోనూ గొడవపడ్డాడు. ఈ క్రమంలో తీవ్రమాన సిక వేధనకు గురైన అన్వర్ మంగళవారం సూ సైడ్ నోట్ రాసి ఉరేసుకున్నాడు. తన భార్యతోపాటు, అత్తామామ, బావ వేధిస్తున్నారని అందులో పేర్కొన్నాడు. మృతుడి తండ్రి ఇస్మాయిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భర్త మరణాన్ని జీర్ణించుకోలేక ..

సదాశివనగర్(ఎల్లారెడ్డి): భర్త మరణాన్ని జీర్ణించు కోలేని ఓ వృద్ధురాలు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. మండలంలోని మర్కల్‌లో మంగళ వారం చోటు చేసుకున్న ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన జూకంటి సుగుణమ్మ(61) భర్త ఆరు నెలల క్రితం మృతి చెందాడు. అప్పటి నుంచి సుగుణమ్మ ఆం దోళన చెందుతూ జీవితంపై విరక్తి చెంది చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుమా రుడు తిరుపతిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

టవల్ కోసం వచ్చి పట్టుబడిన దొంగలు

ఆర్మూర్‌టౌన్: చోరీ సమయంలో మరిచిపోయిన టవల్ కోసం వచ్చిన దుండగులు స్థానికులకు ప ట్టుబడిన ఘటన ఆర్మూర్ మున్సిపాలిటీ పరి ధిలోని పెర్కిట్ ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో శుక్రవారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడి ఒక సిలిండర్, ఫ్యాన్‌తోపాటు రెండు బీపీ ప్యాడ్లను ఎత్తుకెళ్లారు. చోరీ చేసిన సమయంలో టవల్‌ను మరిచిపోయి న దుండగులు మంగళవారం ఉదయం మళ్లీ ఆరోగ్య ఉపకేంద్రానికి వచ్చి చోరీకి యత్నిస్తుండ గా, అదే సమయంలో కాలనీలో విధులు ముగిం చుకుని ఏఎన్‌ఎంలు వచ్చారు. దుండగులను గమనించిన ఏఎన్‌ఎంలు స్థానికుల సహాయంతో వారిని పట్టుకుని పోలీసులకు సమాచారం అం దించారు. పట్టుబడిన వారిని పోలీసులు విచారిం చగా శుక్రవారం రాత్రి సైతం చోరీకి పాల్పడింది తామేనని, దొంగిలించిన సామగ్రిని ఓ స్క్రాప్ దుకాణంలో విక్రయించామని తెలిపారు. పోలీ సులు వారిద్దరినీ స్టేషన్‌కు తరలించారు.

వివాహిత అదృశ్యం

కామారెడ్డి క్రైం: పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన సూర్యవంశం రోజా అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హె చ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఉదయం 9 గంటలకు ఎవరికీ చెప్పకుండా రోజా ఇంట్లో నుంచి బయటికి వెళ్లిపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారు. ఆమె ఆచూకీ లభిం చకపోవడంతో భర్త శ్రీకాంత్ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌హెచ్‌వో తెలిపారు.